www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 నవంబర్ 2023
5
వైఎస్ఆర్

జడ్‌పిటిసికి మంత్రి పెద్దిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

కాశినాయన మండల జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో వైసిపి మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణరెడ్డికి అన్ని విధాల అండగా ఉంటామని, మా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

జడ్‌పిటిసిని పరామర్శించి వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి

ఒపిఎస్ ఇచ్చే వారికే ఎన్నికల్లో మద్దతు

- యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజ, ఎస్.ఎస్.నాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వారికే రాబోయే ఎన్నికలలో తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజ, ఎస్.ఎస్.నాయుడు పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ అధ్యక్షతన యుటిఎఫ్ ద్వితీయ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో ఎస్‌టియుఎఫ్ పతాకాన్ని బి.లక్ష్మీరాజ, యుటిఎఫ్ పతాకాన్ని మాదన విజయకుమార్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బి.లక్ష్మీరాజ, ఎస్.ఎస్.నాయుడు మాట్లాడుతూ పాలకవర్గాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చే వారంలోనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారన్నారు. ఆ హామీని నిజమని నమ్మి ఉద్యోగ, ఉపాధ్యాయులు జగన్మోహన్ రెడ్డిని గద్దెనెక్కిస్తే, అధికారంలోకి రాగానే ఉద్యోగ ఉపాధ్యాయులను విస్మరించారని చెప్పారు. సిపిఎస్ రద్దుపై నాలుగేళ్లు కాలయాపన చేసి సిపిఎస్ కంటే ప్రమాదకరమైన జిపిఎస్ పేరుతో గ్యారంటీ లేని గ్యారంటెడ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసి ఉద్యోగులను మరోసారి దగా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ నిర్వహణ బాధ్యత నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని, విద్యను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి విద్యను అందకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల పక్షపాతిగా తనకు తాను ప్రకటించుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తున్నామని చెప్పి, ఉన్న వేతనాలలో కోత విధించిన ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారని ఎద్దేవా చేశారు. మాట తప్పను, మడమ తిప్పను, విశ్వసనీయత కోల్పోతే అధికారంలో కొనసాగను అని ముఖ్యమంత్రి పలికిన పలుకులకు విశ్వసనీయత లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమైన చర్య అని వారు విమర్శించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ, పిఆర్‌సి, సరెండర్ లీవ్, ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

తమను ప్రశ్నిస్తే సహించే స్థితిలో లేదని, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఉపాధ్యాయులపై కక్షగట్టి వేధింపులు పాల్పడుతున్నదని విమర్శించారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను నిరంతరం వేధిస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ పేద, బడుగు, బలహీన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేస్తున్నారన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 49 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామని, ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సభలు సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగడతామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.డి.దేవదత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను భయపెడుతున్నదని, ఆ భయానికి కారణమేంటో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయులు ఉద్యమిస్తుంటే, ఉపాధ్యాయులపై కన్నెర్ర చేస్తూ ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించాలే తప్ప ఉద్యమాలపై నిర్బంధం సమస్యలకు పరిష్కారం కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగార్జునరెడ్డి, సహధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు జడ్.జయరామయ్య, డి.వి.రవీంద్రుడు, చెరుకూరి శ్రీనివాసులు, సి.వి.రమణ, కె.చెన్నయ్య, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎల్.చంద్ర ఓబుళ్ రెడ్డి, వి.పర్వీన్ వి.మురళీకష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

సేవాగుణమే సర్వోత్తమం

- అత్యుత్తమ ఫలితాలకు కేరాఫ్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల
- వైఎస్ఆర్, యుహెచ్ఆర్ అవార్డుకు నర్సింగ్ కళాశాల విద్యార్థిని
- జిజిహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.హిమగిరికుమారి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

వృత్తుల్లో నర్సింగ్ వృత్తి సర్వోత్తమమైనది. ఇటువంటి ప్రత్యేకత కలిగిన వృత్తి కావడంతోనే నైటింగేల్ మొదలుకుని మధర్‌థెరీసా వంటి ఎందరో మహితాత్ములు ప్రేమ, సేవ, దయాగుణాల కలబోతతో కూడిన అవిరళ కృషి కారణంగా చరిత్ర, ప్రసిద్ధికెక్కారు. భూ మండలం ఉనికిలో ఉన్నంత వరకు వారి పేర్లు ఆచంద్రార్కం. సమకాలీన ప్రపంచంలో కోవిడ్-19 వంటి మహమ్మారి విజృంభించిన చేదు అనుభవాలతో నర్సింగ్ వృత్తి ప్రత్యేకత విలక్షణతను సంతరించుకుంది. ప్రతి ఇంటా ఒక నర్స్ ఉండాలనే వాతావరణాన్ని ఏర్పరించింది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాల్లో నర్సింగ్ వత్తికి అబ్బురపరిచే జీతభత్యాలతో మెరుగైన జీవన ప్రమాణాలను అందుకుంటున్నారని, దేశంలో కూడా నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ, ప్రయివేటు ఆస్ప త్రుల్లోని వివిధ హోదాల్లో ఉద్యోగాల్లో చేరిపోతున్న వృత్తి ఏదైనా ఉందంటే నర్సింగ్ వృత్తేనని పేర్కొంటున్న నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హిమగిరికుమారితో ముఖాముఖి.

ముఖా ముఖి..

నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ ఎలా తీసుకోవాలి?

ఏటా ఎంసెట్, నీట్ తరహాలో ఎపిసెట్ పరీక్ష ఉంటుంది. ఎపిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకుని నిర్ణీత తేదీల్లో ప్రకటిస్తారు. ఎపిసెట్ పరీక్షలో లభించిన ర్యాంకుల ఆధారంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలో సీట్లు లభిస్తాయి. ర్యాంకుల ఆధారంగా ఆయా నర్సింగ్ కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ తీసుకోవాలి.

అడ్మిషన్ల ప్రక్రియ ఎలా ఉంది?

2023-24 అకడమిక్ ఇయర్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. ప్రతి ఏటా జిజిహెచ్ నర్సింగ్ కళాశాలలో 60 సీట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో 50కి పైగా సీట్లు భర్తీ చేశాం. సెకెండ్ కౌన్సెలింగ్ నడుస్తున్న నేపథ్యంలో మిగిలిన10 సీట్లు భర్తీ చేస్తాం.

నర్సింగ్ కాల వ్యవధి ఎంత. విద్యార్థుల సంఖ్య ఎంత?

నర్సింగ్ కోర్సు కాల వ్యవధి నాలుగు సంవత్సరాలు. ప్రతి ఏటా 60 మంది చొప్పున 240 మంది విద్యార్థినులు విద్యా బ్యాసంసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తరుపున సుమారు 18 మంది వరకు జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి చెందిన విద్యార్థినులు విద్యా బ్యాసం సాగిస్తున్నారు. వీరికి ప్రధానమంత్రి నిధుల నుంచి స్కాలర్‌షిప్పులు మంజూరు చేస్తారు. వీరందరికీ ప్రభుత్వమే హాస్టల్ సదుపాయాలను కల్పిస్తోంది.

స్టైఫండ్ వంటి సదుపాయాలు ఏమైనా ఉన్నాయా?

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో చదివే విద్యార్థినులకు ప్రతి నెలా రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు స్టైఫండ్ మంజూరవుతోంది. స్టైఫండ్ ఆధారంగా భోజన, ఇతర కాస్మొటిక్ వంటి సదుపాయాలకు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ కళాశాల ఉత్తీర్ణత గురించి తెలపండి?

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 22 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. సీనియర్ లెక్చరర్స్ కావడంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని ఫస్ట్ సెమిస్టర్‌లో ఫస్ట్‌క్లాస్‌లతో ఉత్తీర్ణత సాధించారు. 25 మంది డిస్టిక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారు. నలుగురు విద్యార్థులు వైఎస్ఆర్, యుహెచ్ఆర్ అవార్డుకు సిఫారసు చేయగా, ఒకరికి అవార్డు, సర్టిఫికెట్, రూ.10 వేల నగదు ఎంపిక కావడం గమనార్హం.

అత్యుత్తమ ఫలితాలను (డిస్టిక్షన్స్) ఎలా రాబట్టగలిగారు?

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 22 మంది డిస్టిక్షన్స్, 38 మంది ఫస్ట్‌క్లాస్ వంటి అత్యుత్తమ ఫలితాలను రాబట్టడానికి ప్రత్యేక కసరత్తు చేశాం. ఛాప్టర్ల వారీగా పరీక్షలు నిర్వహించాం. ఫలితాల్లో వెనుకబడిన విద్యార్థులకు సంబంధించిన సబ్జెక్టు నిపుణులతో చర్చిం చడం, సందేహాలను తీర్చడం, ప్రాపర్ మానిటరింగ్ చేయడం వంటి విధానాలతో సమష్టి కృషి చేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలను రాబట్టగలిగాం.

నర్సింగ్ ల్యాబ్‌లు, ఇతర కృత్యాలను వివరించండి?

ప్రతిఏటా మూడు దఫాలుగా క్లినికల్స్ ట్రయల్స్ నిర్వహించాలి. గర్భిణులు, చిన్నపిల్లలు, పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.

క్రికెట్ అభిమానుల సందడి

- భారీ తెరపై ఇండియా-ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ వీక్షణ

ప్రజాశక్తి-కడప

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఇండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను కడప నగర జిల్లా క్రికెట్ అభిమానులు, ప్రేక్షకులు వీక్షించే విధంగా అతిపెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైంది. మ్యాచ్‌ను తిలకించేందుకు క్రికెట్ అభిమానులు వేలాది సంఖ్యలో హాజరయ్యారు. కడప ఆర్ట్స్ కాలేజ్ మైదానం జనంతో పోటెక్కిపోయింది. అంతకుముందు భారత జట్టు ప్రపంచ కప్ గెలవాలని కోరుకుంటూ కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఏసీఏ సౌత్ జోన్ అకాడమీ ఆధ్వర్యంలో కడప నగరంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అకాడమీ సభ్యులు క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రికెట్ చూసేందుకు భారీగా తరలివచ్చిన యువత, ప్రజలు, ఇండియా జెండా రెపరెపలు

సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

తక్షణమే మెగా డిఎస్‌సి ప్రకటించాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నా మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్‌ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని డివైఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 6 లక్షలకు పైగా నిరుద్యోగులు బిఇడి, టిటిసి పూర్తి చేసి కోచింగ్ సెంటర్లో సంవత్సరాలుగా కాలం కడుపుతో ఉన్నారని తెలిపారు. ఎప్పుడూ నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారని చెప్పారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నిరాశే మిగిల్చిందని తెలిపారు. కనీసం ఇప్పుడైన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వని ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే అని విమర్శించారు.. ఖాళీలతో సంబంధం లేకుండా విద్యశాఖ మంత్రి మాత్రం నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంటులో చెప్పిన లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని. రేషనలైజేషన్ పేరుతో 10వేలు ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని, తెలుగు మీడియం తీసివేసి మరో 15 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని తెలిపారు. నూతన విద్యా విధానం 2020 పేరుతో 5వేల పాఠశాలలు మూసివేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ పై ప్రకటన విడుదల చేయకపోతే నిరుద్యోగులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో నగర అధ్యక్షులు షాకీర్ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

ఐక్యవేదిక సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కడప అర్బన్

బాపట్లలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆయన పర్యటించారు. ముస్లిం ఐక్యవేదిక నాయకులు, ముస్లింలు పెద్ద ఎత్తున సలావుద్దీన్‌కు ఘన స్వాగతం పలికి సత్కరించారు. విజయవాడలో ముస్లిం ఐక్యవేదిక కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విజయవాడకు సంబంధించి ముస్లిం మత పెద్దలు, వివిధ ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల హక్కుల సాధన కోసం రాజకీయాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ముస్లిం ఐక్యవేదిక స్థాపించామని చెప్పారు. భారత రాజ్యాంగం కల్పించిన ముస్లింల హక్కుల పరిరక్షణ, హక్కుల సాధన కోసం ముస్లింలకు అవగాహన కల్పించి వారికి రావలసిన హక్కుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ముస్లింలను రాజకీయంగా,ఓట్ల పరంగా రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని మండిపడ్డారు. ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశంలో భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలను చర్చించి ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర ట్రెజరర్ సలావుద్దీన్, ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర నాయకులు నూర్ ఖాన్, ముస్లిం ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

26న నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 126వ సదస్సును ఈనెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి ఒక పేర్కొన్నారు. ఈ 125వ సదస్సులో కొడవలూరు రామచంద్రరాజు 'మహాసేనోదయం' అనే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత తెలుగు పండితులు ఎ.సి.దస్తగిరి ప్రసంగిస్తారని తెలిపారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరం సాయిపేటలోని ఎ-1 నగర్ లో ఉన్న మసీద్ ఎ గఫారియా మసీదు రస్తాను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మసీదు కమిటీ నాయకులు మహమ్మద్, ఇబ్రహీం, నిస్సార్ అహమద్, ఫరీద్, మునవర్, ఇంతియాజ్, కాలేశా కోరారు.ఆదివారం మసీదు వద్ద కబ్జాకు ప్రయత్నిస్తున్న రస్తాలో పర్యటించారు.ఈ సందరభంగా వారు మాట్లాడుతూ ముగ్గురు ఆక్రమణదారులు ఖాళీ స్థలాలను కబ్జాలు చేసి అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. దొంగ డాక్యుమెంట్లను స ృష్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. రహదారులను కబ్జా చేస్తున్నారని చెప్పారు. మసీదుకు వెళ్లే రహదారిలో ఇప్పటికే మట్టి తోలించారని పేర్కొన్నారు. మసీదు దగ్గరికి వచ్చే వాళ్లను నోటికి వచ్చినట్లు తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరికి అమ్మిన ఆస్తిని పది మందికి అమ్ముతూ మోసం చేస్తున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా రెవిన్యూ శాఖకు సర్వే కోసం రాశారని తెలిపారు. రెవెన్యూ శాఖ సర్వే చేయించి రస్తా అని రిపోర్టు కూడా ఇచ్చిందని చెప్పారు. ఎస్పీ స్పందనలో వినతి పత్రాలు అందించామని పేర్కొన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోవడం బాధా కరమని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదుకు వక్ బోర్డుకు అప్పగించామని చెప్పారు. కార్యక్ర మంలో షేక్. సంధాని, ముసబీర్ ఖాన్, నజీర్, షేక్. నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

శిల్పారామం లో నగరానికి చెందిన ఇండస్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్క ృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. ఆదివారం శిల్పారామం లో సాంస్క ృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, సినీ, శాస్త్రీయ న ృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

జానపద కళలపై పట్టు అవసరం

ప్రజాశక్తి-కలసపాడు

విద్యార్థులు చదువుతోపాటు మానసిక ఉల్లాసం పొందెందుకు భారత సాంస్కృతిక కార్యక్రమాలైన కోలాటం, చెక్కభజన లాంటి సంస్కృతి కార్యక్రమాలు ఎంతైనా అవసరమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత అయిన ఎస్.భజన పుల్లయ్య తెలిపారు. శనివారం మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలను వారి శిష్య బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మారుమూల మండలమైన కలసపాడులో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చక్కటి విద్యా వసతులతో కార్పొరేట్ స్థాయిలో విద్యనభ్యసించే మీరు పడిన శ్రమ ఎప్పటికీ వృథా కాదని వారిని ప్రశంసించారు. ఇలాంటి పాఠశాలలో చక్కటి క్రమశిక్షణ. విద్యతోపాటు ఆధ్యాత్మికపరంగా ప్రాచీన జానపద కళలకు కూడా ప్రాధాన్యం అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్రా, ప్రభావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు ఆధ్యాత్మికంగా, ఆనందంగా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుటకు పాఠశాల స్థాయిలోనే, క్రీడలు, ఆటలు, పాటలు జానపద సంస్కృతిక విభాగములో మరెన్నో కలల గురించి విద్యార్థులకు తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బద్వేల్ జానపద కళాకారుడు బాల గురయ్యా, కలసపాడు మండల మహిళా కోలాట గురువు, ప్రసాద్ రావు, పాల్గొన్నారు.

రఫీని సన్మానిస్తున్న అతిథులు

స్వచ్ఛంద సేవకులకు సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్

అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా అల్ షిఫా కేంద్రంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వఛ్ఛేద సేవకులను ఘనంగా సన్మానించారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించే స్వఛ్ఛేద సేవకులు స్పందిస్తూ రాబోవు రోజుల్లో ప్రభుత్వమే పురుషుల దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం అల్సిఫా వ్యవస్థాపకులు ఎస్. మహమ్మద్ రఫీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిత్రా యోగా సెంటర్ డాక్టర్ రంగనాథరెడ్డి, ప్రముఖ వ్యాఖ్యాత నర్సింహాచారి, మహిళా న్యాయవాది పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయంగా మార్చేందుకు కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

కోటిరెడ్డి మహిళా కళాశాలను మహిళా విశ్వవిద్యాలయంగా మార్చేందుకు తన వంత కృషి చేస్తానని గవర్నింగ్ బాడీ సభ్యులు అరుణ అన్నారు. ఆదివారం ఉమెన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది అమ్మాయిలను ఉత్తమ మహిళలుగా కళాశాల తీర్చించదని పేర్కొన్నారు. రిటైర్డ్ ఆర్‌జెడి పద్మావతి మాట్లాడుతూ కళాశాలకు గొప్పచరిత్ర ఉందని చెప్పారు. 50 సంవత్సరాలలో ఎంతో మంది మహిళలకు విద్యను అందించిందని తెలిపారు. ఉపాధ్యాయురాలు సుశీల మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలలో తోటి స్నేహితులతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం తీపి జ్ఞాపకమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సలీంబాష మాట్లాడుతూ త్వరంలో గోల్డెన్ జూబ్లి ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు శాలిని, అనురాధ, హమ కుమారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అతిథులను శాలువాల, మొమెంటోతో సత్కరించారు.

దళితుల ఓట్ల కోసం వైసిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వం చేస్తున్నది సామాజిక సాధికార యాత్ర కాదు, దళిత నయవంచన యాత్రని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బందెల ఓబయ్య మండిపడ్డారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, టిడిపి ఎస్సీ సెల్ విభాగం నేతలు ఆమూరి బాలదాసు, కొండా సుబ్బయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మునయ్య, హేతువాద సంఘం నేత సి.ఆర్.వి ప్రసాద్, దళిత నేత రెడ్డెన్న, జనసేన పార్టీ ఎస్సీ సెల్ విభాగం గజ్జల సాయి మాట్లాడుతూ బాబాసాహెబ్ రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలనే ఉద్దేశంతో పెట్టిన పథకాలను జగన్మోహన్‌రెడ్డి నా ఎస్సీలు నా ఎస్టీలు నా బిసిలు అంటూ వాళ్ల నోటి కాడ కూడును తీసేశాడన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల సంక్షేమానికి ఉద్దేశించిన 27 రకాల సంక్షేమ పథకాలను తీసేశారన్నారు.

విజ్ఞాన నిలయాలు గ్రంథాలయాలు

-ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు విద్యతోపాటు విజ్ఞానం, మేధోసంపత్తికి మూలమైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా సూచించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ సభా భవనంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్ పర్సన్ ఎల్. ఉషారాణి అధ్యక్షతన 56వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానభాం డాగా రాలు గ్రంథాలయాలేనని, గ్రంథాలయాలు ఎంతో ఉపయో గపడతాయని విద్యార్థులు తమ మేధాశక్తిని చూసుకోవచ్చన్నారు. ఎంతోమంది మహానుభావుల, మేధావుల చరిత్రను తెలుసుకోగలమని జ్ఞానాన్ని సంపా దించవచ్చునని, జ్ఞానం ఒకరి సొత్తు కాదని అన్నారు. మహానుభావులు, మేధావులు గ్రంథాలయాలకు వెళ్లి తమ మేధాశక్తిని దించుకున్న వారేనని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ ఆలయాలకు వెళ్లి తమ జ్ఞాన విజ్ఞా నాన్ని పెంచుకొని పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలని అన్నారు. జ్ఞానాన్ని తోడుకున్నంత జ్ఞానాన్ని గ్రంథాలయాల ద్వారా తోడుకోవచ్చునని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహాత్మా గాంధీ కలలుగన్న స్వరాధ్యాన్ని ప్రవేశపెట్టి గ్రామ సచివాలయాల సముదాయములో వైయస్సార్ డిజిటల్ లైబ్రరీలను మండల స్థాయి నుండి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ గ్రంథాలయాలను ఆశ్రయించి జ్ఞాన, విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని, భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థుల పాఠనా శక్తిని పెంపొందించేందుకు ప్రోత్సహిస్తూ పలు రకాల సాంస్కృతిక పోటీలను నిర్వహించి విద్యార్థులు, పాఠకుల్లో ఉత్సాహాన్ని నింపడం జరుగుతోందన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, మాట్లాడుతూ విద్యార్థులు తమ మేధాశక్తిని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలకు వెళ్లాలని అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు వెళ్ళే విధంగా ప్రోత్సహించాలన్నారు. చివరగా 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా వ్యాసరచన, వకృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థి విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ఎల్.ఉషారాణి, డిఇఒ రాఘవరెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి మంజుల వాణి, కార్పొరేటర్లు సూర్యనారాయణరెడ్డి, కె.బాబు, మార్కెట్ యార్డు చైర్మన్ బండారు నాగయ్య యాదవ్, ఎస్ఎస్ఎ పిఒ ప్రభాకర్‌రెడ్డి, ఎంఇఒ నారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- ఆర్‌టిసి డిపో మేనేజర్ ప్రవీణ్

ప్రజాశక్తి- జమ్మలమడుగు

కార్తీక మాసంలో శైవ క్షేత్రాల సందర్శన నిమిత్తం యాత్రికులకు జమ్మలమడుగు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని డిపో మేనేజర్ పివి ప్రవీణ్ తెలిపారు. ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లో సోమవారం ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. జమ్మలమడుగు నుండి ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు తిరిగి వస్తాయన్నారు. నయనాలప్ప కోన, యాగంటి, మహానంది, ఓంకారం వెళ్ళ పెద్దలకు రూ.615, పిల్లలకు రూ.325 టికెట్ ఛార్జీ ఉంటుందన్నారు. ప్రతి సోమవారం జమ్మలమడుగు నుండి ఉదయం 5 గంటలకు కడప మీదుగా పొలతలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు.

మాట్లాడుతున్న డిఎం ప్రవీణ్

నూతన ఎంపిడిఒకు అభినందనలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఎంపిడిఒగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన దివిజాను పలువురు అభినందించారు. గ్రూపు-1లో ప్రతిభ చూపిన దివిజాను వేంపల్లె ఎంపిడిఒగా నియమించారు. ఈ సందర్భంగా దివిజాను ఎంపిపి లక్ష్మి గాయత్రి ఘనంగా శాలువతో సత్కరించారు. గతంలో ఎంపిడిఒగా పని చేస్తున్న మల్లికార్జునరెడ్డి ఇడుపులపాయ ఆర్జికె విధులు నిర్వహించనున్నారు. ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరించిన దివిజాను ప్రజాప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

దివిజాను అభినందిస్తున్న ఎంపిపి లక్ష్మి గాయత్రి

పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలని ఏపి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దే మద్దిలేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పెన్నా నగర్‌లో ఉన్న సిపిఐ కార్యాలయంలో ఆదివారం ప్రొద్దుటూరు ఏరియా అధ్యక్షుడు ఎం.సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, ఏఐటియుసి మాజీ జిల్లా కార్యదర్శి బి.రామయ్య మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి భవన నిర్మాణ కార్మికుల చిన్నచూపు చూడడమే కాకుండా సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. సమావేశంలో ఏపి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి ఏసోబు, కె.సుబ్బరాయుడు, ఎం.కుమార్, సుబ్బరాయుడు, వెంకటరమణ, సురేంద్ర, ఓబులేసు, పేపర్ శ్రీనివాసులు, షరీఫ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో శ్రీ కనుమ పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల నుండి వివిధ కార్యక్రమాలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చివరి రోజు ఆదివారం పోలేరమ్మ అమ్మవారికి సోమిరెడ్డిపల్లె నుండి ఆనవాయితీగా వస్తున్న పసుపు కుంకుమను ఆ గ్రామ ప్రజలు కుంకుమ బండితో ర్యాలీగా తీసుకొచ్చి సమర్పించారు. అమ్మవారికి సమర్పించే బోనాలలో మొదటి బోనంగా సోమిరెడ్డిపల్లె ఆడపడుచులు నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాలుస్తూ కోలాటం ఆడుతూ కార్యక్రమాలను నిర్వహించారు. మైదుకూరు నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సోమిరెడ్డిపల్లి గ్రామానికి రావడంతో నాయకులు సాంబశివారెడ్డి స్వాగతం పలికారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పణ

బ్రహ్మంగారి మఠంలో పోలేరమ్మ తల్లి ప్రతిష్ట సందర్భంగా యాదవ సంఘం అన్నసత్రం అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో బాలరాజు యాదవ్, పెద్దన్న యాదవ్, సంఘ ప్రముఖులు, కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ర్యాలీగా వెళుతున్న యాదవ సంఘం నేతలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

మండలంలో కాలువకట్ట గ్రామంలో ఆది వారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కాలువకట్ట గ్రామానికి చెందిన నాగదాసరి రాజు(30) లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. సంఘటనాస్థలాన్ని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించి, విచారిస్తున్నారు.

మృతి చెందిన రాజు

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని పొట్లదుర్తి గ్రామంలో ఆదివారం ఆర్‌టిసి బస్సు ఢీకొని రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం ఎదురుగా సంఘటన చోటు చేసుకుంది. పులివెందుల డిపోకు చెందిన ఏపీ 04 జెడ్ 0248 ఆర్‌టిసి బస్సు ప్రొద్దుటూరు వైపు వెళుతుండగా.. రాజు తన ద్విచక్ర వాహనంలో పొట్లదుర్తి నాలుగు రోడ్ల కూడలి నుండి ఎన్టీఆర్ కాలనీ వైపు వెళుతుండగా బస్సు ఎదురుగా ఢీకొంది. రాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసమానతల్లేని అభివృద్ధి కావాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అసమానతలు లేని అభివృద్ధి జరిగితేనే సమాజంలో అందరూ సుభిక్షంగా ఉంటారని, అలాంటి అభివృద్ధినే సిపిఎం కోరుకుంటోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జనాబాలో 60శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారని, వీరి జీవనాధారమైన వ్యవసాయం, పాడిపరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. క్రాప్ హాలిడే ప్రకటించడం వ్యవసాయాధారిత దేశంలో సిగ్గుచేటన్నారు. వలసలు పెరిగాయన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. పట్టణాల్లో భవన నిర్మాణ రంగం పెరిగినప్పటికీ కార్మికులకు భద్రత లేదన్నారు. అసంఘటిత కార్మికుల బీమా మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్థం కోసం దారిమళ్లించాయని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కార్మికశాఖ కనీస వేతనం రూ.27వేలు ఇవ్వాలని సూచించినప్పటికీ.. ఆరేళ్లకు పైబడి పనిచేసే వారిని పర్మినెంట్ చేయాలని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో యర్రగుంట్ల సభలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఆర్‌టిపిపి కార్మికులను పర్మినెంట్ చేస్తామని మడమతిప్పారన్నారు. జిల్లాలో తెలుగుగంగ అంతర్భాగమైన బ్రహ్మంసాగర్‌కు చెందిన పిల్ల కాలువలు, పంట కాలువలు పూర్తి చేయకపోవడం వల్ల 1.57లక్షల ఎకరాల్లో పంట పోయిందన్నారు. కర్నాటక రాష్ట్రం నిర్మించిన ఎగువ తుంగభద్ర ప్రాజెక్ట్ వల్ల కృష్ణ నీటిని తెలంగాణా ప్రభుత్వం తరలించుకుపోవడంతో రాయలసీమ ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతున్నా సిఎం జగన్ తన సిబిఐ, ఇడి కేసులకు భయపడి నోరెత్తడం లేదన్నారు. భూములు, ఇసుక, మద్యం ఇలా అన్ని రకాల మాఫియాలు రాష్ట్రంలో జొరబడ్డాయన్నారు. సిఎం సొంత జిల్లా కడప అయినప్పటికీ అభివృద్ధి శూన్యమన్నారు. 95 శాతం పరిశ్రమలు కడప జిల్లాలో మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరులోని నాయకుల వ్యవహారశైలితో లేదనుకుంటున్న ఫ్యాక్షన్ మళ్లీ జడలు విప్పుతోందన్నారు. జిల్లా అధికారులు స్పందించాలన్నారు. ప్రజాపోరాటాలే వీటన్నిటికీ పరిష్కారం అన్నారు. టిడిపి, వామపక్షాలతో కలిసి రావాలని లేనిపక్షంలో ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి పునరావృతం అవుతుందన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు ముంతాజ్‌బేగం, రమేష్, సర్వేశ్వరి, ఓబులేసు, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ఆటోస్టాండ్ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు విజయ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మూడు నెలల నుండి జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లో ప్రభుత్వ స్థలాల్లో బంకును నెలకొల్పుతున్న షేక్ షేక్షావలి అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌర్జన్యంగా ఆటోస్టాండ్ స్థలాన్ని ఆక్రమించి బంకు ఏర్పాటు చేశారన్నారు. దౌర్జన్యంగా ఆటోస్టాండ్‌ను ఆక్రమించడం ఏంటని సదరు వ్యక్తిని ప్రశ్నిస్తే.. జమ్మలమడుగు సబ్ రిజిస్టర్ అధికారులు తనకు అనుమతులు ఇచ్చారని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. అనుమతులిచ్చిన పత్రాన్ని తమకు చూపించాలని ఆటో కార్మికులు అడిగితే.. మీకు చూపించాల్సిన అవసరం లేదని అంటున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆటో కార్మికులను ఎలాంటి ఇబ్బందులు సృష్టించొద్దని చెప్పినా.. ఆటోస్టాండ్‌లో బంకులు పెట్టి తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆటో కార్మికులు వాపోతున్నారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు సదరు వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకుని, ఆటోస్టాండ్‌లోని బంకును తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పట్టణంలోని సిఐటియు అనుబంధ సంఘాలతో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్, నన్నే.శ్రీను, బాషా, నాగేంద్ర, వెంకటేష్, ఆటో కార్మికుల పాల్గొన్నారు.

ఖాతాల్లోని సొమ్ము ఏమైందో చెప్పాలి? : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఉద్యోగులు అత్యవసరాల నిమిత్తం పొదుపు చేసుకున్న సొమ్మును నెలలు, సంవత్సరాల తరబడి చెల్లించకపోవడం అన్యాయమని, ఖాతాల్లోని సొమ్ము ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యూనియన్ రీజనల్ కన్వీనర్ జి.సి.ఎం.రెడ్డి అధ్యక్షతన ప్రాంతీయ సమావేశానికి నిర్వహించారు. ముఖ్య అతిథిగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల పెళ్లిల్లు, వైద్యపరమైన ఖర్చులకు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహించే ఖాతాలు జడ్పీపిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి వాటిలో తమ జీతాల నుండి మినహాయించి, పొదుపు చేసుకున్న సొమ్మును తీసుకోవాలన్నా కూడా ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సకాలంలో డబ్బులు అందక వివాహాలు, అత్యవసర కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పిఆర్‌సి, డిఎ బకాయిల చెల్లింపులు పదవీవిరమణ తర్వాత చెల్లిస్తామనే కొత్త ఆనవాయితీకి తెరలేపడం సరికాదన్నారు. ఎస్టీయు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఈ మధ్య ప్రతి మండలానికీ ఇద్దరు ఎంఇఒలను నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ వారికి విధుల కేటాయింపులో అసమానతలు చూపి, విభేదాలు, గందరగోళ పరిస్థితులు సృష్టించడం సరికాదన్నారు. ఇద్దరికీ సమాన విధులు కేటాయించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వర్యం చేసే జిఒ 117ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం చేసే విద్యాసంస్కరణలు విద్యావ్యవస్థకు మేలు చేసేలా ఉండాలే తప్ప, విద్యను దూరం చేసి, పిల్లల భవిష్యత్తును దెబ్బతీసేలా ఉండ కూడదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను ప్రవేశపెట్టకుండా కమిటీలతో కాలయాపన చేసి, తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తలాతోక లేని జిపిఎస్ లాంటి పనికిమాలిన ప్రత్యామ్నాయాన్ని అమలు చేస్తామని చెప్పడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యంతోపాటు, ప్రధానోపాధ్యాయులకు డిడిఒ అధికారాలు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్, కెజిబివి ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఎంటిఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు, ప్రిన్సిపల్స్‌కు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం యర్రగుంట్ల, కమలాపురం, విఎన్ పల్లి, ముద్దనూరు మండలశాఖల ఎస్టీయు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు బాలగంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్‌బాషా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు శంకర్‌రెడ్డి, రషీద్‌ఖాన్, సంగమేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, జిల్లా నాయకులు సుకుమార్, రామసుబ్బయ్య, కుండా భాస్కర్, మండల నాయకులు క్రిష్ణయ్య, గురప్ప, శివశంకర్‌రెడ్డి, అన్వర్ బాషా, రామ్మోహన్, విక్రమ్ కేసరి, షేక్షావలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

ఇందిరమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇందిరమ్మకు ఉక్కు మహిళగా పేరు వచ్చిందన్నారు. కాంగ్రెసు పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఇందిరమ్మ అన్నారు. ఇందిరమ్మ చేసిన సేవలు ఇప్పటికీ ప్రజలు మరవలేనివని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, నరసింహారెడ్డి, అమర్నాథ్, వేమయ్య, ఉత్తన్న, బాబు, సుబ్బరాయుడు, మాస్‌బాషా పాల్గొన్నారు.

ముద్దనూరు సమితి కార్యవర్గ సభ్యుల ఎన్నిక

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీ రాజ్ ముద్దనూరు సమితి కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా ఎస్.అమీర్‌బాషా (కొండాపురం), అసోసియేట్ అధ్యక్షులు కె.ప్రతాప్ (కొండాపురం), ఉపాధ్యక్షులు ఎం.కిషోర్‌కుమార్ (మైలవరం), కార్యదర్శి ఎం మహబూబ్ బాషా (జడ్పీహెచ్‌ఎస్ ఉప్పలూరు), సంయుక్త కార్యదర్శి జి.కుమారి (ముద్దనూరు), కోశాధికారి ఎం.లక్ష్మీదేవి (జెడ్పి హెచ్‌ఎస్ వేపరాల), కో-ఆప్షన్ సభ్యులు రంగనాయకుమ్మ (ముద్దనూరు), ఈసీ మెంబర్ పి.వైష్ణవి (జడ్పిహెచ్‌ఎస్ లావనూరు) ఎన్నుకున్నారు.

నేడు మైదుకూరులో వైసిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి చేపట్టిన సాధికార బస్సు యాత్ర సోమవారం మధ్యాహ్నానికి మైదుకూరు చేరుకోనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో హోమ్ మంత్రి తానేటి వనిత, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, వైసిపి నాయకులు బీద మస్తాన్, కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్, జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రీజినల్ కో -ఆర్డినేటర్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు, నియోజక వర్గ పరిశీలకులు సి.ఎల్లారెడ్డి పాల్గొంటారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మైదుకూరు నాలుగు రోడ్లలో వైసిపి జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు.

8న అంగన్వాడీ సిబ్బంది సమ్మె

ప్రజాశక్తి - ఖాజీపేట

అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సమస్యలను పరిష్క రించాలని కోరుతూ డిసెంబర్ 8న సమ్మె చేపట్టనున్నట్లు ఎపి ప్రగతిశీల అంగన్వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.గంగావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 20న సిడిపిఒలు, పీడీలకు వినతిపత్రాలు అందజేశా మన్నారు. 23న జిల్లా కేం ద్రాలు, ఆర్‌డిఒ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమా వేశాలు, 30 వరకు ఆయా సెక్టార్లలో ప్రచారం, డిసెంబర్ 6న అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత, మానవహారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 8వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో హాజరుకానున్నట్లు గంగావతి పేర్కొన్నారు.

నివాళులర్పిస్తున్న అభిమానులు

వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఝాన్సీ లక్ష్మీబాయి వీరవనిత అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సాయంత్రం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి తెలివి, ధైర్యసాహసాలుగలదని కొనియాడారు. 1857 సిపాయిల తిరుగుబాటులో ప్రముఖస్థానం వహించి తన బిడ్డను వీపునకు కట్టుకొని ఆంగ్లేయులతో పోరాడిన గొప్ప దేశభక్తురాలు అన్నారు. జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి పోరాటపటిమ నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అంకాల్ కొండయ్య, సాయికుమార్, వారాది మధు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం అభివృద్ధికి సహకరించండి

కలికిరి : రెడ్డి సంక్షేమ సంఘ అభివృద్ధికి రెడ్లు సహకరించాలని పులి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకుని గృహప్రవేశానికి రెడ్డి సంక్షేమ సంఘం సంఘం హాజరైనట్లు ఆయన తెలిపారు. ముఖ్యఅతిథిగా రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యులు సుమతిరెడ్డి హాజరయ్యారు. గృహప్రవేశ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు జనార్దన్‌రెడ్డి, పార్వతమ్మ పుణ్యదంపతులకు పులమాలలతో ఘనంగా సత్కరించారు. అమర్నాథ్‌రెడ్డి తాతిరెడ్డి, శేషు కుమార్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- అధికారంలోకి రాగానే రాజోలి ఆనకట్ట నిర్మాణం : పుట్టా

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, తమ పార్టీ అధికారంలోకి రాగానే మైదుకూరు ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన రాజోలి ఆనకట్టను నిర్మించి తీరుతామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ 12వ వార్డులో అక్బర్ ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పుట్టా మాట్లాడుతూ మైదు కూరు ప్రాంత రైతులు రాజోలి ఆనకట్ట నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రస్తుత సిఎం శిలాఫలకానికే పరిమితమయ్యారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే రాజోలు ఆనకట్టను పూర్తి చేస్తా మన్నారు. గతంలో పార్టీలోకి రావాలని అక్బర్‌ను కోరినప్పటికీ స్పందించలేదన్నారు. ప్రస్తుతం వార్డులో అభివృద్ధి జరగలేదని గుర్తించి స్వచ్ఛందంగా టిడిపిలో చేరారన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి, నీటి సమస్య పరిష్కారానికి గతంలో తాము ఎంతగానో కృషి చేశామన్నారు. తమ హయాంలో ప్రతిపాదించిన పనులనే ప్రస్తుత ప్రభుత్వం అరకొరగా చేస్తుందన్నారు. వార్డు ఇన్‌ఛార్జిగా అక్బర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.మల్హోత్రా, టిడిపి నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, బిపి సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా

నిరసన తెలియజేస్తున్న జనసేన, టిడిపి నాయకులు

గుంతల రోడ్లపై నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో ఉన్న గుంతల రోడ్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన, టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఆదివారం గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం నిర్వ హించారు. ప్రకాష్ నగర్‌కు వెళ్లే రోడ్డులో బైఠా యించారు. ఈ సం దర్భంగా జనసేన సేవాదళ్ కో-ఆర్డినేటర్ పండ్రా రంజిత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ రోడ్ల దుస్థితిని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎప్పుడో తీసుకెళ్లామన్నారు. చిత్తశుద్ధి లేకపోవడంతో రోడ్లు వేయలేదని విమర్శించారు. రోడ్లపై గుంతలు పూడ్చలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప నియోజికవర్గ టిడిపి అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ రాంప్రసాద్, అవుల వేంకటేష్, బీసీ నాయకులు రెడ్డయ్య యాదవ్, క్రిష్టియన్ సెల్ జిల్లా అద్యక్షులు ప్రేమ్ కుమార్, బెస్త సాధికార కమిటీ జిల్లా సభ్యులు వర్దిబోయిన రాము, అమీర్, ఖాసీం, ఆవుల ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు మిరియల ఈశ్వర్, బాశెట్టి స్వరూప్, శేషు రాయల్, దేవాకుమార్, బాలునాయక్, కుమార్ నాయక్, సుధీర్ నాయక్, ఉపేంద్ర, రాము, శివ, శివసాయి, సాయికృష్ణ ఆచారి, రూప్ కుమార్ ఆచారి, సుబ్బరాయుడు, టిడిపి, జనసేన పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశానుసారం ప్రొద్దుటూరు నియో జకవర్గంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి సారథ్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమంలో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భార్య మౌనిక, అక్క హరిత నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి ముక్తియార్, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు, వాసుదేవపురం జయరాంరెడ్డి, మధుబాబు, రాష్ట్ర దేవాంగ కమిటీ సభ్యులు, అమృత్‌నగర్ ఆర్‌ఎంపి ప్రసాద్, బొమ్మిశెట్టి భానుమతి, బొమ్మిశెట్టి చిన్న, జనసేన పార్టీ నాయకులు జిలాన్‌బాషా, శివ కళ్యాణ్‌రెడ్డి, సంజీవ్ రాయుడు, ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

కార్యక్రమంలో మౌనిక, నాయకులు

టిడిపి నాయకులతో జనసేన నేతలు

టిడిపి బలోపేతానికి ఐక్యంగా పనిచేస్తాం

వేంపల్లె : పులివెందుల నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి కలిసికట్టుగా పని చేస్తామని జనసేన సమన్వయ కర్త డాక్టర్ హరీష్ తెలిపారు. ఆదివారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌ను జనసేన నాయకులు కలి శారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ కార్యా చరణపై ఆయా పార్టీ నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. పులివెందులలో బిటెక్ రవీంద్ర నాథ్‌రెడ్డి విజయం కోసం జనసేన నాయకులు టిడిపికి సహకరించాలని కోరారు. జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసినట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, పీరా సాహెబ్, అల్లాబకష్, వేమా నారాయణ, డక్కా రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, అల్లా బకష్, మడక శ్రీనివాసులు, ఈశ్వరయ్య, గొటూరు నాగభూషణం, జనసేన నాయకులు చైతన్య, శ్యామ్, మహేంద్ర, సాయి, దేవా, మల్లికార్జున, నంద పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA.

O.S.No. 856/2021

Boda Srinivasulu.

...Plaintiff

Vs

Sesham Lakshmi Devi, W/o Late S.Chinna Venkatesh and 4 Others.

...Defendant

NOTICE

పై కేసు నందు వాది ప్రతివాదిపై తనకు రావలసిన బాకి వసూలు చేయుటకు, పై కోర్టు నందు దావా వేసి వున్నారు. కావున ప్రతివాదులు అయిన మీరు పై కోర్టు నందు 23-11-2023వ తేదీన ఉదయం 10.00 గంటలకు మీరు గాని, మీ తరపు లాయరు గాని హాజరై ఆక్షేపనలు ఉన్న యెడల తెలుపుకోవలయునని పై కోర్టు వారు తెలిపియున్నారు. లేనిచో మీకు పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయుచున్నారు.

//By Order of the Court//

V. SRINIVASA RAO, M.A.,B.L.,

Advocate,

KADAPA.

Cell:9849483801.